# అమెరికాలో వర్ణవివక్ష, వర్గదోపిడీలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాందోళనలకు సంఘీభావం తెల్పండి!

**అమెరికాలోని** మిన్నెపోలీస్‌కు చెందిన 46 సం॥ల ఆఫ్రో అమెరికన్ జార్జిఫ్లాయిడ్‌ను మే 25వ తేదీన శ్వేతజాతి పోలీసులు కిరాతకంగా హత్యగావించారు. ఫ్లాయిడ్‌ను క్రిందపడదోసిన పోలీసులు అతని మెడపై మోకాలితో 9 నిముషాలపాటు త్రొక్కిపట్టి ఊపిరిఆడకుండా చేసి ప్రాణం తీశారు. భయావహులైన చుట్టుప్రక్కల వారు అతని ప్రాణాలు కాపాడాల్సిందిగా కోరినా వారు పెడచెవిన పెట్టారు. ఈ భయానక దృశ్యాన్ని కొందరు వీడియోలలో బంధించారు. ఇది సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం కావటం ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. అమెరికా వ్యాపితంగా ఈ హత్యను నిరసిస్తూ వేలాది ప్రజానీకం ముఖ్యంగా అన్ని జాతులకు చెందిన యువత, కార్మికవర్గం వీధుల్లోకి వచ్చారు.

నిరసనకారులను 'థగ్గు'లుగా, దొంగలుగా ముద్రలువేసే కుట్రలకు ఎప్పటిలాగానే పాలకవర్గాలు పూనుకున్నాయి. ఇది జాతి వివక్షను అంతమొందించటంలో అమెరికా సామ్రాజ్యవాదంయొక్క వైఫల్యాన్ని మాత్రమేగాక, ప్రస్తుత అమెరికా సమాజంలో నిరంతరంగా పెరుగుతోన్న ఆర్థిక, సామాజిక అసమానతలను వెల్లడిచేస్తోంది.

పోలీసుల చేతిలో కాల్చిచంపబడుతున్న వారిలో శ్వేతజాతీయులకంటే నల్లజాతీయులు 2.5 రెట్లు అధికంగా వుండటం; కోవిడ్ సంక్షోభానికి ముందు కూడా మొత్తం నల్లజాతీయుల జనాభాలో 20 శాతం (షుమారు 9 కోట్లమంది) తీవ్రపేదరికంలో జీవిస్తూవుండటం; కోవిడ్-19 ప్రభావంతో సాగిన భారీ నిరుద్యోగులలో 4 కోట్లమందిగా వుండటం; వైరస్ కారణంగా మృత్యుబారినపడటంలో అంతరాలు; పోలీసులు నిరంతరాయంగా నల్లజాతీయులపై సాగిస్తున్న అకృత్యాలు వంటివన్నీ అంతర్లీన చలన సూత్రాలుగా పనిచేయటమే దేశవ్యాపిత నిరసనకు కారణమైంది.

జార్జిఫ్లాయిడ్ హత్యలో వర్ణవివక్ష అనేది ఓ ప్రముఖమైన అంశమనేది నిస్సందేహం. అయితే అమెరికా సామ్రాజ్యవాదం సామాజిక అసమానత్వాన్ని మరింత లోతుగా పాదుకునేలా ఖచ్చితమైన సామాజిక సందర్భంలో జాత్యహంకారాన్ని ప్రోత్సహించటం జరుగుతూవస్తోంది. కార్మికవర్గాన్ని చీల్చటానికి పాలకవర్గాలు అన్ని సందర్భాల్లోనూ ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలో ప్రతి ఏటా పోలీసులు సాగించే హింస కారణంగా వెయ్యిమందికి పైగా పోలీసులు బలవుతుండగా, వీరిలో అత్యధికులు నల్లజాతీయులు కాగా, తరువాత శ్వేతజాతీయులుగా వున్నారు. వీరిలో సాధారణ సామ్యమేమంటే వీరంతా కార్మిక వర్గాన్నుండి, అందులోని అతిపేద దొంతరలనుండి వచ్చిన వారై వుండటం.

ప్రజలను అణచటానికి సైనిక బలగాలను ప్రయోగిస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించటాన్ని సిపిఐ(ఎం-ఎల్)కేంద్రకమిటి తీవ్రంగా ఖండిస్తోంది. సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వంకోసం అమెరికా ప్రజలు సాగిస్తున్న ఆందోళనకు సంఘీభావాన్నిందించవలసిందిగా ప్రజలకు, ప్రజాస్వామ్యశక్తులకు పిలుపునిస్తోంది.

3-6-20
విజయవాడ

**విశ్వం,** ప్రధాన కార్యదర్శి
**సిపిఐ(ఎం-ఎల్)**

---

# కా॥వరవరరావు తదితరులను వెంటనే విడుదల చేయాలి

**విప్లవ** రచయితల సంఘం నాయకులు కా॥వరవరరావు, తదితరులను భీమా-కొరేగావ్ తప్పుడు కేసులో ఇరికించి గత 18 నెలలుగా నిర్బంధంలో వుంచారు. అనారోగ్యానికి గురైన వరవరరావును ఆసుపత్రిలో చేర్చి జైలు అధికారులు చికిత్స అందిస్తున్నారు. ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో కలుసుకునేందుకు అనుమతించాలిని, వారి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని అనుసరించాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

కామ్రేడ్ వరవరరావును, 90 శాతం అంగవైకల్యంతో, అనారోగ్యంతో నిర్బంధంలో కొనసాగుతున్న ప్రొఫెసర్ సాయిబాబాను వారితోపాటు తప్పుడు కేసులో నిర్బంధంలోనున్న వారందరినీ తక్షణమే విడుదల చేయాలని మేము, ప్రజాస్వామిక శక్తులు, ప్రజాస్వామికవాదులందరం డిమాండ్ చేస్తున్నాం.

**విశ్వం,** ప్రధానకార్యదర్శి
**సిపిఐ(ఎం-ఎల్)**